# సోలా గ్రేషియా, సోలాఫైడె, సోలి డియో గ్లోరియా

Prof. David Nirikshana Rao Kurakula



*మీరు విశ్వాసము ద్వారా క్రుపచేతనే రక్షింపబడియున్నారు, ఇది మీ వలన కలిగినది కాదు దేవుని వరమే.. ఎవడును అతిశయపడ వీలులేదు -ఎఫెసీ 2:8,9*

*నీతిమంతుని జ్ఞాపకము చేసికొనుట ఆశీర్వాదకరమగును -సామెతలు 10:7*

*క్రీస్తు యేసు నందుంచవలసిన విశ్వాసము ద్వారా రక్షణార్థమైన జ్ఞానము నీకు కలిగించుటకు శక్తిగల లేఖనములను... నీవు నేర్చుకొని రూఢియని తెలిసికొన్నవి యెవరి వలన నేర్చుకొంటివో ఆ సంగతి తెలిసికొని, వాటి యందు నిలకడగా ఉండుము" -2 తిమోతి 3:14,15*

అక్టోబరు మాసం వచ్చిందంటే మహనీయుడైన మతోద్ధారకుడు రెవ. దాక్టర్ మార్టిన్ లూథర్ ను ప్రతి క్రైస్తవుడు జ్ఞాపకం చేసుకోవాలి. మహోన్నతుడును, మహా పరిశుద్ధుడైన దేవునికి లూథర్ మహాశయుని బట్టి క్రుతజ్ఞతా స్తుతులు చెల్లించాలి. ఇది ఆశీర్వాదకరమైన ఆత్మీయ పరిశ్రమ.

జీవిత సంగ్రహం:

1483 నవంబరు 10వ తేదీన జర్మనీ దేశంలోని ఐస్లెబెన్ గ్రామంలో హాన్స్ (యోహాను) మరియు మార్గరీటా లూథర్ దంపతులకు జ్యేష్ట కుమారునిగా జన్మించిన లూథర్ దేవుని భయ భక్తులలో పెరిగాడు. సార్ధక నామధేయుడయ్యాడు. (మార్టిన్=సైనికుడు: లూథర్ అనేది ఆయన ఇంటిపేరు. ఆమాటకు అర్ధం పవిత్రము) తండ్రి అభీష్టము తన కుమారుని లాయర్ ను చెయ్యాలని. అయితే పరమ తండ్రి చిత్తానుసారముగా లూథర్ దాక్టర్ ఆఫ్ హోలీ స్క్రిప్చర్స్ అయ్యారు. (Luther Preferred to be reffered as the Doctor of Scriptures) B.A., M.A., D.D పట్టాలు పొందాడు.విటెన్ బర్గ్ లో ప్రీస్ట్ గా అభిషేకం పొంది, వేదాంత కళాశాలలో ప్రొఫెసరుగా పని చేశాడు. దేవునికి ఇష్టుడుగా ఉండగోరి కఠినమైన దీక్షలు, ఉపవాసాలు చేశాడు. అయితే ఆయన ఆత్మలోని అంతర్మథనం పెరుగుతూనే ఉంది కాని

నెమ్మది ఏమాత్రం కలుగ లేదు. రోం నగరం వెళ్ళి పిలాతు నివాసంలో యేసయ్య ఎక్కి వెళ్ళిన మెట్లను మోకాళ్ళపై ఎక్కాడు. వీటిని Scala Sancta (పవిత్రమైన మెట్లు) అని పిలుస్తారు. ఈ చెక్క మెట్లు రోముకు తేబడి జ్ఞాపికలుగా ఉంచబడ్డాయి. ఆ మెట్లు ఎక్కుచుండగా నీతిమంతుడు విశ్వాస మూలముగా జీవించును (రోమా 1:17) అనే వాక్యం ద్వారా పరిశుద్ధాత్ముడు లూథర్ తో మాట్లాడాడు. లూథర్ హృదయంలో చెప్పశక్యంగాని సమాధానము, సంతోషం కలిగాయి. రక్షణ కేవలం ప్రభువైన యేసు క్రీస్తు నందలి విశ్వాసం ద్వారా, దేవుని ఉచితమైన క్రుపను బట్టి మాత్రమే కలుగుతుందని, మానవుని స్వనీతి క్రియల వలన కలగదని  రూఢిగా తెలిసికొన్నాడు.  ఆ విషయాన్నే ధైర్యంగా ప్రబోధించాడు.

ఆ దినాల్లో రోం నగరం లో నిర్మాణం ప్రారంభించ బడిన సెయింట్ పీటర్ బెసెల్లికా (మహా దేవాలయం) నిధులకై ఆనాటి రోమన్ కాథలిక్ సంఘం దేవుని క్రుపను వ్యాపారంగా మార్చగా, జర్మనీలో జాన్ టెట్ జెల్ నాయకత్వంలోని పాప పరిహార పత్రికలు (Indulgenses) విక్రయాన్ని లూథర్ ఎదుర్కొన్నాడు. ఇవి లేఖనాలకు విరుద్ధమని తెగేసి చెప్పాడు. పోపు సంతకంతో వివిధ ధరల్లో లభించే ఆ పాప పరిహార పత్రికలు - భూత, వర్తమాన, భవిష్యత్ పాపాలను కూడా పరిహరిస్తాయి అనే తప్పుడు ప్రచారాన్ని నమ్మిన అనేకమంది అమాయకులు, అవినీతి పరులైన ధనవంతులు వేలం వెర్రిగా ఈ సర్టిఫికెట్ లను కొంటూఉంటే, ఈ అక్రమాలకు అసలు కారణము దేవుని వాక్యము అందుబాటులో లేకపోవడమే అని తెలిసికొన్న లూథర్, అప్పటి వరకు లాటిన్ భాషలోనే, సంకెళ్ళలో ఉన్న బైబిల్ గ్రంధాన్ని జర్మన్ భాషలోకి అనువదించాడు. దేవుని సంకల్పం చొప్పున పిలువబడిన వారికి (దేవుని ప్రేమించు వారికి) సమస్తము సమకూడి మేలు కొరకై జరుగును (రోమా 8:29) అనే వాక్యపు నెరవేర్పుగా అదే సమయంలో గూటెన్ బర్గ్ (Gutenberg) ముద్రణా యంత్రాన్ని కనుగొనడం, బైబిల్ తమ స్వంత భాషలో ప్రజలకు అందుబాటులో రావడానికి ఎంతగానో తోడ్పడింది. అప్పటి కాథలిక్ సంఘంలోని తప్పులను 95 చర్చనీయాంశాలుగా వ్రాసి 1517 అక్టోబర్ 31న (తెల్లవారితే నవంబర్ 1, సర్వ పరిశుద్ధుల దినం - తమ పితరుల సమాధులను దర్శించుకోవడానికి, దేవాలయంలో ప్రార్థించుకోవడానికి ప్రజలు వేలాదిగా తరలి వస్తారు గనుక న్యూస్ పేపర్లు, రేడియోలు, టి.వి.లు లేని ఆ రోజుల్లో విస్తృత ప్రచారం లభించేందుకై ఆ దినాన్ని ఎన్నుకొన్నాడు) విటెన్ బర్గ్ దేవాలయపు తలుపులకు కొట్టాడు. అనుకొన్నట్టే వాక్యాధారంగా చేసిన లూథర్ సిద్ధాంతాలకు విపరీతమైన ప్రజాదరణ లభించింది. అయితే పోపు మరియు అతని అనుచరులు లూథర్ ను బెదిరించారు, బహిష్కరించారు. అయినా లూథర్ తొణకలేదు, బెణకలేదు వారు కోరినట్లు తన వాదనలను వెనకకు తీసుకోలేదు. Here I Stand, God help me, Amen! అనే మాటలు లూథర్ విశ్వాసానికి, వీరోచిత పోరాటానికి మచ్చుతునకలు. ఆయన విజయానికి సజీవ సాక్ష్యాలే నేటి ప్రొటెస్టంట్ సంఘాలు - ముఖ్యంగా మన లూథరన్ సంఘం. లూథర్ 18-2-1546న పరమపదించాడు.

లూథర్ జీవితాన్ని ముచ్చటగా మూడు మాటల్లో చెప్పాలంటే

1. A man of Choir/Chorale: సంఘారాధనకు ప్రారంభకుడైన వ్యక్తి

లూథర్ క్రైస్తవ లోకానికి బైబిల్ నే కాదు, కీర్తనల పుస్తకాన్ని కూడా కానుకగా ఇచ్చాడు. లూథర్ కు ముందు ఆరాధనల్లో ప్రీస్ట్ లు మాత్రమే, అదీ లాటిన్ భాషలోనే పాటలు పాడేవారు (ఏ దేశంలోనైనా). అయితే సంఘంగా దేవుని స్తుతిస్తూ విశ్వాసులందరు తమ స్వభాషలో స్తుతి పాటలు పాడటం లూథర్ తోనే ప్రారంభమైనది. 1524లో మొదటి కీర్తనల పుస్తకం ప్రచురించబడినది. ఇందులో కేవలం 8 పాటలున్నాయి. వాటిలో నాలుగు లూథర్ వ్రాశాడు. మూడు పాల్ స్పిరేటస్ అనే వ్యక్తి ఒకటి పేరు తెలియని వ్యక్తి వ్రాశారు. ఈనాడు క్రైస్తవ విశ్వాసులుగా - వారు ఏ శాఖవారైనా - బైబిల్ చదివి కీర్తనలు పాడుకోగలుగుచున్నామంటే లూథర్ ను బట్టియేనని గట్టిగా తెలిసికొని, ఆ మహా భక్తుని బట్టి దేవునికి స్తుతులు చెల్లించాలి. ఆయన పాటలు రచించడమే కాదు, వాటికి రాగాలు కూడా కట్టాడు. ఆయన వ్రాసిన పాటలు మొత్తం ముప్పై ఆరు. వీటిలో కేవలం రెండు మాత్రమే - మా కర్త గట్టి దుర్గము, దేవుండపైన ఆత్మరా ప్రస్తుతము తెలుగులో చెలామణిలో ఉన్నాయి. మిగిలిన 34 కూడా ఇటీవలే అనువదించ బడ్డాయి. త్వరలో ఒరిజినల్ రాగాలతో విడుదల కాబోవుచున్నవని తెలిసికోవడం ఎంతో ముదావహం.

2. A man of Prayer: ప్రార్థనాపరుడైన వ్యక్తి

లూథర్ గొప్ప ప్రార్థనా యోధుడు. ప్రపంచాన్ని పాలించే/శాసించే ఆనాటి పోపును వంటరిగా ఎదిరించగలిగాడంటే దాని రహస్యం ఆయన యొక్క ప్రార్థన పటిమయే. ఒకసారి ఆయన భార్య కాథరిన్ (KATY MY RIB అని ప్రేమగా పిలిచేవాడు లూథర్) ఎక్కువ పనులున్న రోజు ప్రార్థనకు ఎక్కువ సమయం ఎలా పొందగలుగుచున్నారని ప్రశ్నిస్తే లూథర్ ఇలా చెప్పాడు. ఎక్కువ పనులుంటే ఎక్కువ ప్రార్థించాలి. దానికొరకై ఆదినం తక్కువగా నిద్రిస్తాను! మనమైతే ఎక్కువ పనులుంటే తక్కువగా ప్రార్థిస్తాం ఎక్కువగా నిద్రిస్తాం!! ఓయీ నిద్రబోతా! నీకేమివచ్చినది లేచి నీ దేవుని ప్రార్థించుము (యోనా 1:5) అనే మాటలు అచేతనమైన క్రైస్తవలోకానికి, ముఖ్యంగా లూథరన్ సంఘానికి అన్యులైన నావికుల హెచ్చరిక. లూథర్ పేరు పెట్టుకున్నందుకైనా లూథర్ ను చూచి నేర్చుకొందాం.

3. A man of Scriptures: లేఖనాలయందు పటిమ కల్గిన వ్యక్తి.

లేఖనములయందు అచంచల విశ్వాసము కలిగి, అపారంగా వాటిని అధ్యయనం చేసిన వ్యక్తి లూథర్. సహచరులతో కలసి వారం వారం బైబిల్ స్టడిలు నిర్వహించి వాక్యాన్ని పరిశోధించిన వ్యక్తి. లూథర్ తన పుస్తకాలలో తమ బైబిల్ స్టడీలను గురించి వ్రాస్తూ అవి దాదాపు కొట్లాటకు కేవలం కొంచెమే తక్కువగా ఉండేవి అని వ్రాశాడు. అంత లోతుగా, నిశితంగా వాక్యాన్ని అధ్యయనం చేశారన్న మాట. లూథర్ వలే

వ్యక్తిగత బైబిల్ స్టడి, గ్రూప్ బైబిల్ స్టడీలు విస్తరిస్తేనే తప్ప ఆయన సాధించి పెట్టిన సంఘ సంస్కరణ తుప్పుపట్టకుండా ఆపలేం.

రక్షణకు లూథర్ ఇచ్చిన వాక్యానుసారమైన (ఎఫెసీ 2:8,9) లాటిన్ నినాదమే ఈ వ్యాసపు శీర్షిక Sola Gratia, Sola Fide, Sola Deo Gloria (By grace alone, through faith alone, to God alone be glory) క్రుపచేతనే, విశ్వాసం ద్వారానే, దేవునికి మాత్రమే మహిమ!

రక్షించ బడదాం! రక్షణ మార్గాన్ని ప్రబోధిద్దాం!! రక్షకుడైన దేవుని మహిమ పరుద్దాం!!!